I

# సాక్షి పెద్దపల్లి

గురువారం। 9। మే। 2024

## మల్లన్నకు పూజలు

ఓదెల: ఓదెల శ్రీమల్లికార్జున స్వామి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారికి పట్నాలు వేశారు.



## న్యూస్‌రీల్

### బీఎల్‌వోలతో సమీక్ష



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): రామగుండం అసెంబ్లీ నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులు(బీఎల్‌వో), సూపర్‌వైజర్లతో పోలింగ్ నిర్వహణ తీరుపై బుధవారం సమీక్షించారు. ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పోల్ స్లిప్పులను ప్రతీ ఓటరుకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలనానరు. ఓటింగ్ శాతం పెంచేలా కృషి చే యాలని కోరారు. రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

### రైస్‌మిల్లులకు ధాన్యం తరలించండి



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): తూకం వేసిన వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ ఆదేశించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్, సుగ్లాంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. కోత లేకుండా మిల్లర్లు ధాన్యం అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలని తెలిపారు. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఎన్నికల విధులకు సింగరేణి ఉద్యోగులు

గోదావరిఖని: జిల్లాలో ఈనెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో విధుల నిర్వహణ కోసం ఉద్యోగులను కేటాయించాలని ఎన్నికల సంఘం సిగరేణి యాజమాన్యాన్ని కోరింది. ఈమేరకు సంస్థవ్యాప్తంగా పనిచేస్తున్న ఉద్యోగుల్లో సెక్యూరిటీ, క్లరికల్, జనరల్ మజ్దూర్లను ఏరియాల వారీగా కేటాయించనుంది. అన్ని ఏరియాల నుంచి సిబ్బందిని కేటాయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 11 ఏరియాల్లోని 1100మందిని ఎన్నికల విధులకు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల గుర్తింపు యూనియన్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్.. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందిని ఆన్‌డ్యూటీగా పరిగణించాలని కోరారు. ఈక్రమంలో ఆన్ డ్యూటీగా పరిగణించనున్నట్లు తెలుస్తోంది.

### 'మోదీ పాలనను ప్రశ్నించాలి'



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పదేళ్ల మోదీ పాలనలో అవినీతిపై ప్రజలు ప్రశ్నించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద నాయకుడు మాదన కుమారస్వామి, టీపీఎఫ్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య తదితరులు బుధవారం కరపత్రం ఆవిష్కరించారు. ప్రజల ఆకాంక్షలను కాదని ప్రధాని మోదీ ముస్లింలు, మంగళసూత్రాలు లాంటి అంశాలనే ప్రస్తావిస్తూ చర్చను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. బీజేపీ పాలనలో ఆర్థిక వ్యత్యాసాలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. నాయకులు రాజమల్లయ్య, మార్వాడి సుదర్శన్, గాండ్ల మల్లేశం, రామిళ్ల బాపు, రవీందర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### మామిడితోటల పరిశీలన

ధర్మారం(ధర్మపురి): ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షంతో నేలరాలిన మామిడితోటలను ఉద్యానవనశాఖ అధికారి జ్యోతి బుధవారం పరిశీలించారు. బంజేరుపల్లి, గోపాల్‌రావుపేట, కటికెనపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేశారు. ఇప్పటికే తోటల్లోని మామిడికాయలు కోశారని, మిగిలిన కాయలు ఈదురుగాలులకు రాలిపోయి రైతులకు నష్టం వాటిల్లిందని ఆమె తెలిపారు.

### నిర్భయంగా ఓటు వేయండి

పెద్దపల్లిరూరల్: ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని పెద్దపల్లి ఏసీపీ కృష్ణ కోరారు. సాయుధ బలగాల కవాతును జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసేందుకు పోలీసు యంత్రాంగం సాయుధ బలగాలతో రక్షణ కల్పిస్తోందని తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కు వినయోగించుకోవాలని ఆయన కోరారు.

# ప్లాన్-3



- మిగిలింది మూడు రోజులే
- దూసుకొస్తున్న గడువు
- వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో ప్రచారం చేసేలా ప్రణాళిక
- రథాలు, సామాజిక మాధ్యమాలే కీలకం
- మండలాల వారీగా సంఘాలతో భేటీలకు ఏర్పాట్లు

సాక్షి, పెద్దపల్లి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి గడువు మరో మూడు రోజులే మిగిలి ఉంది. ఈనెల 13న పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం.. 48 గంటల ముందే ఎన్నికల ప్రచారం ముగించాల్సి ఉంటుంది. పార్లమెంట్ నియోజకవర్గ విస్తీర్ణం విశాలంగా ఉండడం, ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో అభ్యర్థులు ప్రతీ ఓటరును నేరుగా కలిసే అవకాశం లేదు. దీంతో సభల నిర్వహణపైనే అభ్యర్థులు దృష్టి సారించారు. ఇందుకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా భారీ బహిరంగ సభల్లో పాల్గొన్ని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. అయి తే, ఎన్నికల ప్రచారానికి మూడు రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉండటంతో ఇప్పటివరకు ప్రచారమంతా మాటలతో సాగింది. ఓటర్లను పూర్తి స్థాయిలో తమవైపు తిప్పుకునేందుకు చివరి అంకానికి తెరతీస్తున్నారు.

**ఎక్కువ మందిని కలిసేలా..**

- నగరాలు, పట్టణాలు, మండలాల్లో వీలైనంత ఎక్కువ మంది ఓటర్లను కలిసేసేలా అభ్యర్థులు ప్లాన్ చేసుకుంటున్నారు.
- ఏ రోజు.. ఏ మండలంలో ప్రచారం నిర్వహించాలో షెడ్యూల్ సిద్ధం చేసుకుంటున్నారు.
- ముఖ్యంగా మండలాల వారీగా యువజన, మహిళా, కుల, యువజన సంఘాలతో భేటీలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.
- హామీలు గుప్పిస్తూ వారిని ఆకట్టుకోవాలని నిర్ణయించారు.
- సమయం తక్కువ ఉన్నందున అభ్యర్థులు ఇంటింటి ప్రచారం చేసే వీలులేకపోవటంతో వారి అనుచరులు, పార్టీ శ్రేణుల ద్వారా గడపగడపకూ తిరిగి ఓట్లు అభ్యర్థించే బాధ్యతలు అప్పగిస్తున్నారు.
- అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా ఏజెంట్లను నియమించుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

**మండల కేంద్రాలు, పట్టణాలు, నగరమే లక్ష్యం**

అన్ని గ్రామాల్లో పర్యటించడం కష్టం కావటంతో మండల కేంద్రాలు, పట్టణాలు, రామగుండం నగరంలో సభలు నిర్వహిస్తున్నారు. అక్కడక్కడా గ్రామాలమీదుగా, పట్టణాలు, నగరంలోని కాలనీల మీదుగా కార్నర్ మీటింగులు, ర్యాలీలు చేపడుతూ ప్రచారం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రచారం చేసే బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలకు అప్పగించారు. మొత్తమ్మీద సమయం తక్కువగా ఉండడంతో అభ్యర్థులు, ప్రచార బాధ్యతలెత్తుకున్న నాయకులు ఉరుకులు, పరుగులు తీస్తున్నారు. ప్రచారం చివరిరోజు అధినేతల సభలు, రోడ్‌షోలు ఏర్పాటు చేయడం ద్వారా వీలైనన్ని ఎక్కువ ఓట్లు సాధించాలని అభ్యర్థులు భావిస్తున్నారు.

**సోషల్ మీడియాలో హీటెక్కిస్తున్నారు..**

- ఎండలకుతోడు ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య మాటల తూటాలతో లోక్‌సభ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది.
- మంగళవారం కురిసిన అకాల వర్షంతో వాతావరణం చల్లబడినా.. పోలింగ్ ముగిసే వరకూ సోషల్ మీడియా వింగ్‌ల ద్వారా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించేలా వ్యూహాలకు పదునుపెడుతున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో మాటలు, తూటాలు, విమర్శనాస్త్రాలతో పార్టీలు ప్రచారం హోరెత్తిస్తున్నాయి.
- తక్కువ సమయంలో ఎక్కువ మంది ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధానంగా ప్రచార రథాలు, సోషల్ మీడియాపైనే అభ్యర్థులు ఎక్కువగా ఆధారపడుతున్నారు.

# విజన్ ఉంది



- అభివృద్ధి చేసి చూపిస్తా
- బకాయిలతో 25 ఏళ్ల వెనక్కి సింగరేణి
- ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకొస్తా.. స్థానికంగా ఉపాధి కల్పిస్తా
- ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా
- 'సాక్షి'తో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

'బొగ్గు, బూడిద, నీళ్లు, ఇసుక లాంటి వనరులతో రాష్ట్రానికే హార్ట్ ఆఫ్ తెలంగాణగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఉంటుంది.. అలాంటి ఈ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నా వద్ద విజన్ ఉంది.. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకొచ్చి ప్రగతి పథంలో నడిపిస్తా' అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా పాల్గొంటున్న వంశీకృష్ణతో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.. – సాక్షి, పెద్దపల్లి



**రాజకీయాల్లోకి ఎందుకు రావాలనుకున్నారు?**

ఆదినుంచీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం మాది. మా తాత వెంకటస్వామితో ప్రజలను దగ్గరి నుంచి చూశా. అందుకే చిన్నప్పటి నుంచే రాజకీయాల్లోకి రావాలనే ఆసక్తి పెరిగింది. నీతి, నిజాయతీ, ప్రజాసేవలో తాతే ఆదర్శం. సక్సెస్‌ఫుల్ బిజినెస్‌మ్యాన్‌గా ఉన్నా. దానిద్వారా ప్రజలకు సేవచేసే అవకాశం తక్కువే. అందుకే రాజకీయాల్లోకి రావాలనుకున్నా. నాన్న సలహాలు తీసుకుంటున్నా.. స్వతంత్రంగానే వ్యవహరిస్తా.

**మీ వారసత్వం, స్థానికతపై వస్తున్న విమర్శలపై మీరేమంటారు?**

గెలిస్తే ప్రజలకు ఏం చేస్తారో? గతంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పుకోవడానికి వారి వద్ద ఏమీలేక నాపై విమర్శలు చేస్తున్నారు. నేను, ప్రజలు వాటిని పట్టించుకోం. 40ఏళ్లుగా మాకు పెద్దపల్లి పార్లమెంట్‌తో అనుబంధం ఉంది. సింగరేణిని కాపాడి ఎంతోమంది కార్మికులకు అండగా నిలిచాం. ఆర్‌ఎఫ్‌సీఎల్ పునరుద్ధరణ కోసం పోరాడింది మా నాన్నే.. స్థానికంగా ఉపాధి అవకాశాలు మేం కల్పిస్తే.. రూ.20వేల వేతనాలు వచ్చే ఉద్యోగాలను డబ్బులకు అమ్ముకున్న చరిత్ర బీఆర్‌ఎస్ నేతలది.

**ఎన్నికల ప్రచారంలో స్పందన ఎలా ఉంది? ఎమ్మెల్యేలు, క్యాడర్ సహకరిస్తోందా?**

ప్రతీకాంగ్రెస్ కార్యకర్త నన్ను సోదరుడిగా ఆశీర్వదిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వారే. దీంతో వారు నా గెలుపుకోసం వ్యూహరచన చేస్తున్నారు. ధర్మపురిలో ఉపాధిహామీ కూలీలను కలిశా. వారి సమస్యలు నాకు చెప్పుకున్నారు. బీఆర్‌ఎస్ వాళ్ల తమ సమస్యలు పరిష్కరించలేదని వాపోయారు. సమస్యలు చెప్పుకుందామని పోతే నెట్టివేసిన సందర్భాలున్నాయని తెలిపారు. ప్రస్తుత ప్రజాపాలనలో సమస్యలు నేరుగా చెప్పుకోగలుగుతున్నామని అన్నారు. ఇలా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తున్నది.

**ఎవరితో ప్రధాన పోటీ అనుకుంటున్నారు?**

బీజేపీ ప్రైవేటీకరణతో, బీఆర్‌ఎస్ స్కాంలతో ప్రజలను మోసం చేశాయి. ఆ పార్టీల అభ్యర్థులు నాకు పోటీయేకాదు. కొప్పుల ఈశ్వర్ మంత్రిగా ఉండి ఏంచేయలేదనే కోపం ప్రజల్లో ఉంది. అందుకే ఆయనను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ఎవరో నాకే కాదు నియోజకవర్గ ప్రజలకు సైతం తెలియదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేసే అభివృద్ధి, మా ఫ్యామిలీ చేసిన అభివృద్ధి నన్ను ఎంపీగా గెలిపిస్తాయి.

**గెలిస్తే మీరు ఏం చేయాలనుకుంటున్నారు?**

ప్రపంచంలో లేని సోలార్ రూఫ్ ప్రొడక్ట్ కనిపెట్టినందుకు అమెరికా ప్రభుత్వం నాకు అవార్డు ఇచ్చింది. సొంతంగా సోలార్ బైక్ ఫ్యాక్టరీ స్థాపించి పేటెంట్ హక్కు పొందా. సొంతంగా వ్యాపారం స్థాపించి 500మందికి ఉద్యోగాలు ఇచ్చా. అట్లాంటి నాకు పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధిపై ఓ ప్రత్యేక విజన్ ఉంది. కేంద్రప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి ప్రభుత్వరంగ సంస్థలు నెలకొల్పుతా. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తా. బొగ్గు, సిరామిక్, కాటన్, ఇసుక ఆధారిత పరిశ్రమలు నెలకొల్పుతా. రైల్వే సమస్యలు పరిష్కరిస్తా. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని రామగుండం–మణుగూరు రైల్వేలైన్, సింగరేణి పారిశ్రామిక కారిడార్ నిర్మిస్తా.

**గెలుపును ప్రభావితం చేసే సింగరేణి కార్మికులకు మీరిచ్చే హామీ ఏమిటి?**

కార్మికుల ఆదాయ పన్నుమినహాయింపు కోసం కృషిచేస్తా. కొత్త గనులు తవ్విస్తా. సొంతింటి కల నెరవేరుస్తా. సింగరేణి కష్టాల్లో ఉన్నప్పుడు రూ.450కోట్లు తీసుకొచ్చి కాపాడింది, కనీస వేతన బోర్డు ఏర్పాటు చేసింది వెంకటస్వామి(కాకా). లక్షల మంది ఉద్యోగులను కాపాడిన చరిత్ర కాకాది. మెడికల్ అన్‌ఫిట్ పేరిట కార్మికుల కష్టాన్ని బీఆర్‌ఎస్ సర్కార్ దోచుకుంది. ఇప్పుడు బకాయిలతో సింగరేణిని 25 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లింది. ఆ బకాయిలు ఇప్పించడానికి ప్రయత్నం చేస్తా. కార్మికులకు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి తీసుకొస్తా.

**ఓటర్ల వద్దకు ఏ అంశాలు తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు?**

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ అమలు చేస్తోంది. బీఆర్‌ఎస్ పదేళ్ల లో ఏమీచేయలేదు. కాంగ్రెస్ గెలిచిన నాలుగు నెలల్లోనే గ్యారంటీ పథకాల్లో కొన్ని అమలు చేసి ప్రజల్లో నమ్మకం కలిగించాం. రైతుభరోసా, రుణమాఫీని కూడా త్వరలో అమలు చేస్తామని సీఎం ప్రకటించారు.

**ఓటర్లకు ఏం చెప్పాలనుకుంటున్నారు?**

విశాఖ, కాకా ట్రస్ట్‌తో అనేక సేవా కార్యక్రమాలు చేశాం. ప్రజాసేవకే రాజకీయాల్లోకి వచ్చా. డబ్బు సంపాదించేందుకునేందుకు కాదు. కాకా, వివేక్ ఎంపీగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి ట్రాక్ రికార్డు చూసి ప్రజలు ఓటు వేసి ఆశీర్వాదించాలని కోరుతున్నా.

# కమలదళంలో హుషారు

- తన ప్రసంగంతో ఉత్సాహం నింపిన ప్రధాని మోదీ
- రాజన్నను దర్శించుకున్న తొలి ప్రధాని
- పోలీస్ వలయంలో ఆధ్యాత్మిక క్షేత్రం
- జనహోరుతో మార్మోగిన శైవక్షేత్ర పరిసరాలు
- బహిరంగ సభకు భారీగా జనం హాజరు





వేములవాడలో జరిగిన బీజేపీ బహిరంగ సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న ప్రధాని మోదీ

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రం వేములవాడ కాషాయమయమైంది. అడుగడుగునా పోలీసుల తనిఖీలు.. కమలదళం కవాతులతో మార్మోగింది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం వేములవాడకు రాగా.. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ముందుగా రాజన్నను దర్శించుకున్న మోదీ నేరుగా.. బహిరంగసభ వేదికపైకి వచ్చారు. తన ప్రసంగంతో కాషాయదళంలో హుషారు నింపారు. సమరోత్సాహంతో ముందుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. బీజేపీ కరీంనగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని మోదీ కోరారు. ఈ ముగ్గురికి ఓటేస్తే తనకు వేసినట్లేనని ఆయన చెప్పారు. దీంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపు వేదిక ప్రాంగణం మోదీ.. మోదీ.. అనే నినాదాలతో దద్దరిల్లింది. పట్టణంలోని కూడళ్లు, బైపాస్‌రోడ్డు కాషాయజెండాలతో నిండిపోయింది.

**పొద్దు పొద్దుగాళ్ల గింత జనప్రవాహమా..**

'వేములవాడ జనసభ' పేరుతో నిర్వహించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభ విజయవంతమైంది. ఉదయం 10 గంటలకే బహిరంగసభకు భారీగా జనం తరలివచ్చారు. సరిగ్గా 10.30 గంటలకు సభ ప్రాంగణానికి మోదీ చేరుకుని.. జన సందోహాన్ని చూసి చలించిపోయారు. హెలికాప్టర్‌లో నుంచి జనప్రవాహాన్ని చూసిన మోదీ.. ఈ విషయాన్ని వేదికపై నుంచి ప్రస్తావించారు. 'నేను గుజరాత్‌లో మూడుసార్లు సీఎంగా పనిచేసిన. అక్కడ ఎన్నో ఎన్నికలు చూసిన. కానీ గుజరాత్‌లో కూడా పొద్దు పొద్దుగాళ్ల గింత పెద్ద జనసందోహాన్ని ఎన్నడూ చూడలేదు. కానీ ఇక్కడ ఇంతమంది తరలిరావడం.. సభ బయట కూడా భారీగా జనం వస్తున్న దృశ్యాలను చూస్తుంటే... మీ అందరూ నాపై చూపుతున్న ప్రేమాభిమానాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా..' అంటూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ విజయం ముందే ఖాయమైందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అతి కష్టం మీద నిలబెట్టగా.. ఓటమి ఖాయమైందని ఎద్దేవా చేశారు. బీఆర్ ఎస్ అడ్రస్ గల్లంతైందన్నారు.

**ఆరడుగుల బుల్లెట్ కావాలా? దొంగల ముఠా నేత కావాలా?**

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌పై పంచ్‌ల వర్షం కురిపించారు. కాశీ నుంచి దక్షిణకాశీకి వచ్చిన తొలి ప్రధాని నరేంద్రమోదీని కాశీవిశ్వేశ్వరుని ప్రతిరూపంగా అభివర్ణించారు. ఆరడుగుల బుల్లెట్ మోదీ కావాలా? దొంగల ముఠా బ్యాచ్ నేత రాహుల్ కావాలా? ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్‌ను గద్దె దించి మెడలు పట్టి గెంటేసిన జగమొండి నరేంద్రమోదీ అని వ్యాఖ్యానించారు. 'పక్కా లోకల్ మోదీ, మేడ్ ఇన్ భారత్ బీజేపీ.. నాన్‌లోకల్ సోనియాగాంధీ, మేడ్ ఇన్ బ్రిటీష్ పార్టీ కాంగ్రెస్..' ఎవరి పక్షాన నిలుస్తారో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. 370 ఆర్టికల్‌ను రద్దు చేసి శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను అమలు చేసిన జగమొండి మోదీ అన్నారు. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించిన జగమొండి మోదీ.. అని పేర్కొన్నారు. హిందువుల 500 ఏళ్ల కల అయోధ్య రామమందిరానికి ప్రాణప్రతిష్ఠ చేసిన జగమొండి అన్నారు. కరోనా వ్యాక్సిన్ అందించి 140 కోట్ల మంది ప్రజల ప్రాణాలను కాపాడారన్నారు. మూతపడ్డ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని రూ.6వేల కోట్లకు పైగా వెచ్చించి తెరిపించిన విషయాన్ని గుర్తుచేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.12వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. బీజేపీని గెలిపిస్తే హైవేలు, ఇంటర్నెట్, రైల్వేలు, ఎయిర్‌వేస్‌లతో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు.

**గాడిదగుడ్డు చూపుతున్నారు**

ఆరు గ్యారంటీలను అడిగితే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజలకు గాడిదగుడ్డు చూపిస్తున్నారని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వలేదని, రూ.2లక్షల రైతుల రుణమాఫీ చేయలేదన్నారు. మోదీ ఏ పని చేపట్టినా వాళ్ల అమ్మ ఆశీస్సులు తీసుకుని బయటకొస్తారని.. ఇప్పుడు అమ్మ లేరు కాబట్టి మనమంతా మోదీ పక్షాన ఉంటూ మూడోసారి ప్రధానిని చేసుకుందామని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

# స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయండి

- పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్



ఈవీఎం యూనిట్లు పరిశీలిస్తున్న ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఈవీఎం యూనిట్లలో సింబల్ లోడింగ్ చేసిన వాటికి సీల్‌చేసి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపర్చామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లో జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన యూనిట్లను అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపర్చారు. ఈవీఎంలో గుర్తులు లోడ్ చేసి సీల్‌చేశామన్నారు. సింబల్ లోడింగ్ యూనిట్లను ఫలితాలు ప్రకటించిన తర్వాత నాలుగు రోజుల లోపు ఉంచుతామని వివరించారు. కలెక్టర్ ఏవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఈడీఎం కవిత పాల్గొన్నారు.

**స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేయాలి..**

రామగిరి(పెద్దపల్లి): పోలింగ్ పూర్తయ్యాక ఈవీఎంలను భద్రపర్చేందుకు స్ట్రాంగ్‌రూమ్‌లను సిద్ధం చేయాలని, ఇదే సమయంలో ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. జేఎన్టీయూలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్‌రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలను అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, దివాకరతో కలిసి ఆయన పరిశీలించారు. పార్లమెంట్‌లోని ధర్మపురి, పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు జేఎన్టీయూలో చేపడతామన్నారు.

# ఉపాధి కల్పనే కాంగ్రెస్ ధ్యేయం

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



రాజ్‌ఠాకూర్‌కు సంఘీభావం ప్రకటిస్తున్న నాయకులు

గోదావరిఖని: ఉద్యోగాల కల్పన కాంగ్రెస్‌తోనే సాధ్యమని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్‌లో బుధవారం జరిగిన సీపీఎం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు కనీస మద్దతు ధర, ఉపాధిహామీ కూలీలకు రోజు కూలి రూ.400 వరకు పెంపు, పేద రైతుకు ఏటా రూ.లక్ష, రూ.25 లక్షల వరకు నగదు రహిత వైద్య సదుపాయం, 30లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన తమ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్, సీపీఎం నాయకుడు యాకయ్య ఉన్నారు.

**ఆదాయపు పన్ను మాఫీకి కృషి**

సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను మాఫీకి వెసులుబాటు కల్పిస్తామని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ హామీ ఇచ్చారు. ఆర్జీ –వన్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికులు వ్యాధుల బారిన పడుతుంటే స్పందించని కేసీఆర్.. కొప్పుల ఈశ్వర్‌కు ఓటువేయాలని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలిస్తే సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చుతామన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే కార్మికుల ఇళ్లకు పట్టాలతోపాటు కాంట్రాక్టు కార్మికులకు 200గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పారు. కార్మిక క్షేత్రం రాబోయే రోజుల్లో పారిశ్రామిక క్షేత్రం ఇండస్ట్రియల్ హబ్‌గా మారబోతోందని పేర్కొన్నారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, నర్సింహారెడ్డి, తిప్పారపు శ్రీనివాస్, పాతిపెల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం**

గోదావరిఖని: అకాల వర్షానికి తడిసిన ప్రతీ ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు స్వయంగా తనతో ఫోన్‌లో ఈవిషయం చెప్పారన్నారు. రైతులెవరూ అధైర్య పడవద్దని, అధికారులకు ఆదేశాలు చేశారని ఆయన వివరించారు.

## రైతులను ఆదుకోవాలి



ధాన్యం పరిశీలిస్తున్న కొప్పుల ఈశ్వర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: అకాల వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయిన, సాగు నీరు అందక దిగుబడి రాని రైతుకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. పెద్దబొంకూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. నాయకులు మర్కు లక్ష్మణ్, రాములు, సంపత్, మిట్టపల్లి శ్రీనివాస్, నవీన్‌కుమార్, లక్ష్మీరాజం, రవి, రాజేశం, పోచమల్లు, అనిల్, తిరుపతి, నరేశ్, రాకేశ్ పాల్గొన్నారు.

**ప్రశ్నించే గొంతుకకు పట్టం కట్టండి**

కోల్‌సిటీ(రామగుండం): ప్రజాసమస్యలపై గొంతెత్తాలంటే కారుగుర్తుకు ఓటు వేయాలని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. గోదావరిఖనిలోని ప్రధాన చౌరస్తాలో నగరపాలక పారిశుధ్య కార్మికులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్‌తో కలిసి ఈశ్వర్ ఓట్లు అభ్యర్థించారు.

# కాంగ్రెస్‌కు సేవ చేసే వారందరికీ గుర్తింపు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్(మంథని): కాంగ్రెస్ పార్టీలో పనిచేసే ప్రతీఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమాన్‌పూర్, కన్నాలకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఇనగంటి రామారావు, పీట్ల గోపాల్, మల్క రామస్వామి, వారి అనుచరులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. కన్నాలలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతోనే కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని అన్నారు. తనపై తప్పుడు కూతలు కూస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామమని హెచ్చరించారు.

**యువతకు ఉద్యోగాలు ఇస్తాం**

పెద్దపల్లిరూరల్: తనను పార్లమెంట్‌కు పంపిస్తే ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హామీ ఇచ్చారు. యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయరమణారావుతోపాటు ఎమ్మెల్సీ, యూత్‌కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, దుద్దిళ్ల శ్రీనుబాబు తదితర నేతలు హాజరయ్యారు. బీఆర్‌ఎస్, బీజేపీ మోసపూరిత విధానాలు అవలంబిస్తున్నాయని ఎమ్మెల్యే విజయరమణారావు విమర్శించారు. నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అనారోగ్యంతో రిటైర్డ్ ఎంఈవో మృతి


రాజస్వామి (ఫైల్)

కరీంనగర్: మానకొండూర్, చొప్పదండి మండలాల ఎఫ్ఏసీ రిటైర్డ్ ఎంఈవో, జీహెచ్ఎం చీర్ల రాజస్వామి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం వేకువజామున కరీంనగర్‌లో మృతి చెందారు. ఈ క్రమంలో డీటీఎఫ్ జిల్లా శాఖ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేసింది. రాజస్వామి ఉమ్మడి జిల్లాలోని కాటారం మండలం దామెరకుంట గ్రామానికి చెందిన వారు. ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసం ఉంటున్నారు. డీటీఎఫ్ కాటారం మండల ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిలర్‌గా పని చేశారు. మహదేవ్‌పూర్, కాటారం ప్రాంతాల్లో డీటీఎఫ్ బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. జీహెచ్ఎం, డీసీఈబీ సెక్రటరీగా, మానకొండూరు, చొప్పదండి మండలాల ఎఫ్ఏసీ ఎంఈవోగా ఇటు ఉపాధ్యాయులకు, అటు అధికారులకు అందుబాటులో ఉంటూ విశేష సేవలందించారు. రాజస్వామికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

### చిరుత దాడిలో దూడ మృతి


మృతి చెందిన దూడ

కోనరావుపేట(వేములవాడ): మండలంలో మళ్లీ చిరుత సంచారం మొదలైంది. తాజాగా ధర్మారంలో ఓ దూడను చంపింది. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన మల్లివేణి శ్రీనివాస్ మంగళవారం రాత్రి శ్రీవేంకటేశ్వర గుడి సమీపంలోని పొలం వద్ద దూడను కట్టేశాడు. బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి దూడ మృతి చెంది ఉంది. ఆనవాళ్లను బట్టి చిరుత దాడి చేసినట్లు నిర్ధారణ చేశారు. ఈ సంఘటనతో చుట్టు పక్కల పొలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులను పొలాల వద్ద కట్టేయవద్దని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు.

### విషగుళికలు తిని 12 గొర్రెలు..


గొర్రెల కళేబరాలు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): విషగుళికలు తిని బుధవారం 12 గొర్రెలు మృతి చెందినట్లు మండల కేంద్రానికి చెందిన బాధిత కాపరులు తెలిపారు. మేత కోసం అడవికి తీసుకెళ్లిన గొర్రెలు.. ఓ కవర్‌లో కనిపించిన మేతను తిన్నాయని, ఇందులో 12 గొర్రెలు తీవ్ర అస్వస్థతలో మృతి చెందాయని, మరికొన్ని అస్వస్థతకు గురయ్యాయని పేర్కొన్నారు. ఒజ్జె రాజయ్యకు చెందిన 6, అల్లంల కొమురయ్యకు చెందిన 3, మేర్గవేన సుధాకర్‌కు చెందిన 2, మండల చంద్రయ్యకు చెందిన ఒక గొర్రె మృతి చెందాయని వివరించారు. అస్వస్థతకు గురైన వాటికి పశువైద్యాధికారులు చికిత్స అందించి కాపాడారు.



# సిరిసిల్ల విప్లవ గీతిక

- భూపతిరెడ్డి ఎన్‌కౌంటర్‌కు 30 ఏళ్లు
- రైతాంగ ఉద్యమాల నిర్మాణంలో దిట్ట
- ఎన్వీ కృష్ణయ్య గెలుపులో ప్రధాన పాత్ర
- హైదరాబాద్‌లో బందీ.. బద్దెనపల్లిలో బలి
- భూపతిరెడ్డి యాదిలో అనేక పాటలు


సాయుధ జనశక్తి నక్సలైట్ల దళం (ఫైల్)

సిరిసిల్ల: రైతుకూలి సంఘంగా.. దున్నేవాడికే భూమి దక్కాలి అనే నినాదంతో మొదలైన వామపక్ష ఉద్యమాలకు సిరిసిల్ల కేంద్ర బిందువు. వెట్టిచాకిరీ విముక్తి, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు సీపీఐ(ఎంఎల్) జనశక్తి పార్టీ బాటలు వేసింది. ఈక్రమంలో జనశక్తి పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రైతాంగ పోరాటాలను అగ్ర పథాన నిలిపిన భూపతిరెడ్డి అలియాస్ బోడ లక్ష్మారెడ్డి ఎన్‌కౌంటర్ జరిగి 30 ఏళ్లు అవుతుంది. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్(పదిర)కు చెందిన భూపతిరెడ్డి ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదారు. జనశక్తి పార్టీ సాయుధ పోరాట పంథాను, పార్లమెంటరీ విధానాన్ని అనుసరిస్తూ.. ప్రజాపోరాటాలను నిర్మించింది. జిల్లా కార్యదర్శి హోదాలో భూపతిరెడ్డి అలియాస్ జీవన్ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు లాడ్జీలో 1994 మే 8న పోలీసులకు చిక్కి తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి మామిడితోటలో మే 9న తెల్లవారుజామున ఎన్‌కౌంటర్‌లో బలి అయ్యాడు. ఈ ఎన్‌కౌంటర్ అప్పట్లో ఓ సంచలనం. భూపతన్న ఎన్‌కౌంటర్‌కు 30 ఏళ్లు నిండిన సందర్భంగా ఆయన యాదిలో 'సాక్షి' ప్రత్యేక కథనం...

**ఆర్ఎంపీ వైద్యుడు... సాయుధుడయ్యాడు**

ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన భూపతిరెడ్డి పదో తరగతి వరకు చదువుకున్నాడు. స్థానికంగా ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తూ సీపీఐ(ఎంఎల్) చంద్ర పుల్లారెడ్డి వర్గంలో మిలిటెంట్‌గా పనిచేసేవాడు. దళసభ్యుడిగా, దళనాయకుడిగా, సిరిసిల్ల ప్రాంత జోనల్ కార్యదర్శిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యదర్శి వరకు ఎదిగారు. జనశక్తి ఉద్యమ నిర్మాతలు కూర రాజన్న, చలపతిరావు అడుగుజాడల్లో ముందుకు సాగారు. నక్సలైట్ దళాల నిర్మాణం, ప్రజాపోరాటాల నిర్మాణంలో ముందున్నారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు, వెట్టిచాకిరీ విముక్తి, తునికాకు కూలి పెంపు, అటవీ భూముల పంపకం, భూస్వాముల భూములను ప్రజల పరం చేయడం, రైతు, కూలీల కూలి రేట్లను పెంచడం వంటి సామాజిక ఉద్యమాలను సాగించారు. ముఖ్యంగా కులసంఘాలను పెట్టి ప్రజాపోరాటాలను నిర్మించారు. అప్పట్లో సమాంతర ప్రభుత్వాన్ని కొనసాగించారు.

**ఎన్వీ కృష్ణయ్యను ఎమ్మెల్యేగా గెలిపించిన వైనం**

జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న భూపతిరెడ్డి 1989లో నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్వీ కృష్ణయ్యను సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిపించారు. భూపతిరెడ్డి సారథ్యంలో సాయుధ దళాలు ప్రజలను, కులసంఘాలను కూడగట్టారు. అప్పట్లో సిరిసిల్ల నియోజకవర్గం పరిధి సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు చందుర్తి, కోనరావుపేట, బోయినపల్లి మండలాలు ఉండేవి. పట్టున్న గ్రామాల్లో ప్రజలను ఏకం చేసి, కులసంఘాలను ప్రభావితం చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించగా.. కమ్యూనిస్ట్ ఉద్యమ యోధుడు, అప్పటి మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు ఆ ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నేరెళ్ల, జగిత్యాల, మెట్‌పల్లి, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనశక్తి పార్టీ అభ్యర్థులను బరిలో దించి ఓట్లు సాధించడంలో భూపతిరెడ్డి కీలకపాత్ర పోషించారు.


భూపతిరెడ్డి అలియాస్ బోడ లక్ష్మారెడ్డి (ఫైల్)

**ఎదురుదాడులను అధిగమించి..**

1990 దశకంలో జనశక్తి భూపతిరెడ్డి(బీపీఆర్) పాలకవర్గాల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాడు. పోలీసులు టార్గెట్ చేసి ఆయన కోసం అనేక చోట్ల మాటువేశారు. ఎన్నో పోలీసుదాడుల్లో భూపతిరెడ్డి ప్రజల సహకారంతో తప్పించుకున్నారు. మరోవైపు అప్పటి పీపుల్స్‌వార్(ఇప్పటి మావోయిస్టు) సాయుధ దళాలతో వైరుధ్యం ఉండేది. పరస్పర దాడులు.. హత్యలతో సిరిసిల్ల ప్రాంతం అట్టుడికిపోయేది. 1985లో కోనరావుపేట మండలం కొండాపూర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు సాయుధులు మృతిచెందారు. అదే మండలంలోని ధర్మారం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో రిక్కల సహదేవ్‌రెడ్డి ఎన్‌కౌంటర్ అయ్యారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో జనశక్తి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. సాయుధ దళాల నిర్మాణంలో ముదాం రామన్న, జంపన్న, మంగన్న, యాదన్న, గోపన్న, భీమన్న వంటి ముఖ్యనాయకులను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో భూపతిరెడ్డి ముందున్నారు. 1992లో ఏడు విప్లవ పార్టీలను ఏకం చేసి సీపీఐ(ఎంఎల్) సీపీ గ్రూప్‌గా ఉన్న సాయుధ పార్టీని జనశక్తిగా ఆవిర్భావం చేయడంలో భూపతిరెడ్డి భాగస్వామి అయ్యాడు. సిరిసిల్ల, వేములవాడ, రుద్రంగి వంటి ప్రాంతాల్లోనూ ప్రజలను ఏకం చేశాడు. పట్టణాల్లో ఉంటూ.. అడవుల్లో సాయుధుడిగా సంచరిస్తూ.. ఎన్నో సార్లు పోలీసుల కళ్లు కప్పి తప్పించుకున్నాడు. ఎదురుదాడులను ఎదిరించినా.. అప్పటి సిరిసిల్ల సీఐ రామయ్య పన్నిన వ్యూహంలో బందీ అయి... బలి అయ్యాడు.


హరిదాస్‌నగర్‌లో నిర్మించిన భూపతిరెడ్డి స్మారక స్థూపం

**ఆయన యాదిలో పాటలు..**

30 ఏళ్ల కిందట ఎన్‌కౌంటర్ అయిన భూపతిరెడ్డి యాదిలో అనేక పాటలు అరుణోదయ కళాకారులు కైగట్టి పాడారు. అందులో 'సుడిసుడి గుండాలు.. ఆగని గండాలు.. సూర్యుడయ్యి నిలిచే జీవన్.. చుక్కలల్ల గలిచే జీవన్'.. అంటూ.. వచ్చిన పాట జనబాహుళ్యంలో ప్రాచుర్యం పొందింది. హరిదాస్‌నగర్‌లో కామారెడ్డి–కరీంనగర్ ప్రధాన రహదారి పక్కనే ఆయన స్మారకార్థం స్థూపాన్ని ప్రజలు నిర్మించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో జనశక్తి ఉద్యమ నిర్మాతల్లో ముఖ్యుడిగా భూపతిరెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

## 'బోయినపల్లి'కి ప్రైవేట్ టీచర్ల మద్దతు


మాట్లాడుతున్న ట్రస్మా నాయకుడు శేఖర్‌రావు

కరీంనగర్: జిల్లాలోని ప్రైవేట్ టీచర్ల మద్దతు బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కేనని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్‌రావు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా బాధ్యులు హనుమాండ్ల రవీందర్‌రెడ్డి, ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ హోటల్లో సమావేశం నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యావేత్త, అన్ని సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వినోద్‌కుమార్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కరోనా కాలంలో ఆయన విన్నపం మేరకే ప్రభుత్వం 6 నెలలపాటు ప్రైవేట్ టీచర్లకు రూ.2,500, 25 కిలోల బియ్యం చొప్పున అందజేసిందన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై ఎంపీగా పార్లమెంట్‌లో మాట్లాడారని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్, నివేశన స్థలాల విషయమై గళమెత్తారన్నారు. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే ప్రైవేట్ టీచర్లతోపాటు అసంఘటిత రంగ కార్మికులకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

## తిమ్మాపూర్‌లో అగ్ని ప్రమాదం

- ఐదు రోజుల్లో మూడోసారి..
- ఆందోళనలో రైతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌లో బుధవారం వ్యవసాయ పొలాల్లో అకస్మాత్తుగా మంటలు ఎగిసిపడి పశుగ్రాసం, గుడిసెలతోపాటు అందులో నిల్వ చేసిన టేకు కలప, విద్యుత్ మోటార్ల పైపులు, స్టార్టర్లు కాలిపోయాయి. ఐదు రోజుల వ్యవధిలో మూడు సార్లు ఒకే గ్రామంలో మంటలు వ్యాపించి ఆస్తి నష్టం జరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తిమ్మాపూర్‌కు చెందిన రైతులు అల్లె ముత్తయ్య, ప్రతీప్, కొలకాని లక్ష్మయ్య, కొలకాని రవి, ఉస్కె శ్రీనివాస్‌కు చెందిన గడ్డివాములు, గుడిసెలు, వంట సామగ్రి, టేకు కలప, కరెంట్ పైపులు కాలిపోయాయి. దీంతో రైతులకు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఎంసీ మాజీ చైర్మన్ అందే సుభాష్, నాయకులు వరద సతీశ్, గట్ల అనిల్, అల్లె శంకర్, భీమరి శేఖర్ కోరారు.


తిమ్మాపూర్‌లో మంటల్లో కాలిపోతున్న పశుగ్రాసం

# పోస్టల్ బ్యాలెట్ గడువు పొడిగింపు


పోస్టల్ ఓటు వేసిన డీసీపీ చేతన

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించే గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించామని పెద్దపల్లి అసెంబ్లీ ఎన్నికల సహాయ అధికారి గంగయ్య తెలిపారు. బుధవారమే గడువు ముగియాల్సి ఉందని, అయితే, పోస్టల్ బ్యాలెట్ పొందిన వారంతా ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా గడువు పొడిగించామని పేర్కొన్నారు. కాగా, స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీ సెంటర్‌లో పెద్దపల్లి డీసీపీ చేతన తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా ఎంపీ అభ్యర్థి ప్రొఫెసర్ నెతానియల్ ఓటుహక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు.

### ఓటు గల్లంతు అయితే..

జ్యోతినగర్(రామగుండం): పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఓటు లేకపోయినా, ఈ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేసరికి అక్కడ మీ ఓటు లేకపోయినా, ఓటరు జాబితాలో పేరు గల్లంతైనా, ఓటరుకార్డు లేదా ఆధార్ కార్డు చూపించి సెక్షన్ 49ఏ కింద చాలెంజ్ ఓటు వేయవచ్చు. మీ ఓటు అప్పటికే వేరే ఎవరైనా వేసేసినట్లయితే, ధైర్యంగా టెండర్ ఓటు అడగవచ్చు. ఏ పోలింగ్ కేంద్రంలో అయినా.. 14శాతం దాటి ×టెండర్ ఓట్లు పోలైతే, అక్కడ రీ–పోలింగ్ నిర్వహిస్తారు.

**ఓటరు స్లిప్పుల కోసం..**

- 1950 నంబరుకు ఎస్ఎంఎస్ చేయండి.
- ECI–VOTER ID.
- 15 సెకన్లలో ఓటరు స్లిప్పు వస్తుంది.

## పోలీసుల అదుపులో బైక్ దొంగ

- విచారిస్తున్న సిద్దిపేట పోలీసులు
- మరో ముగ్గురి కోసం గాలింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన ఓ బైక్ దొంగను బుధవారం సిద్దిపేట జిల్లా క్రైం బ్రాంచ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల సిద్దిపేటలో నాలుగు ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి అక్కడి పోలీసులు విచారణ చేపట్టగా మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ఆ వాహనాలను దొంగలించినట్లు తెలియడంతో అదుపులోకి తీసుకున్నారు. దొంగను విచారించగా.. మరో ముగ్గురికి సంబంధం ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది. కాగా ఇటీవల అంతర్ జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు పెద్ద సంఖ్యలో చోరీకి గురవుతున్న విషయం తెలిసిందే. బైక్ చోరీలను పోలీసులు సీరియస్‌గా తీసుకొని దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు.

### రూ.9.25 లక్షలు పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోచీబజార్‌లో పట్టణ ఎస్సై మన్మథరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. బీర్‌పూర్ మండలం మంగేళకు చెందిన గుర్రం రాజేశం ఎలాంటి ఆధారాలూ లేకుండా తీసుకెళ్తున్న రూ.2.50 లక్షలు సీజ్ చేశారు. కొత్తబస్టాండ్‌లో జగిత్యాలకు చెందిన షేక్ సాదుల్లా నుంచి రూ.2లక్షలు, సారంగాపూర్ మండలం లచ్చక్కపేటకు చెందిన కొలగాని సురేశ్ నుంచి జంబిగద్దె ప్రాంతంలో రూ.1.80 లక్షలు, పాతబస్టాండ్ ప్రాంతంలో జగిత్యాల రూరల్ మండలం గొల్లపల్లెకు చెందిన పుల్లె శివ నుంచి రూ.2.95 లక్షలను సీజ్ చేసి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌సెల్‌కు తరలించామని పోలీసులు పేర్కొన్నారు.


### రూ.2.09 లక్షలు, చీరలు..


నగదు చూపుతున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ సరిలాల్ తెలిపారు. రాజీవ్ చౌక్‌లో కరీంనగర్ తిలక్ రోడ్‌కు చెందిన పెద్ది రాధాకృష్ణ వద్ద రూ.2.09 లక్షలు పట్టుకున్నామన్నారు. సంబంధిత ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అక్రమ డబ్బు, మద్యం సరఫరాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోర్టు చౌరస్తాలో ఓ వాహనంలో తరలిస్తున్న 400 చీరలను పట్టుకున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

# 'ప్రైవేట్' దోపిడీ షురూ

- కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు
- ముందస్తు ప్రవేశాల ప్రచారానికి రెడీ
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ



ముందస్తు అడ్మిషన్ల కోసం ఓ కార్పొరేట్ స్కూల్ కరపత్రం

కరీంనగర్: ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజుల పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలకువేలు దండుకుంటున్నాయి. ఏటా జిల్లా విద్యాశాఖ నోటీసులు జారీ చేయడం, తనిఖీలు చేపట్టడం, మళ్లీ యథావిధిగా ప్రైవేట్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం రివాజుగా మారింది. పలుస్కూళ్లను తనిఖీ చేస్తూ లోపాలు ఎత్తిచూపుతున్నామని చెప్పడం వరకే విద్యాశాఖ అధికారులు పరిమితమవుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఆర్భాటంగా ప్రచారం చేస్తూ ప్రవేశాలు తీసుకోవడం, పాఠశాలల్లోనే పుస్తకాలు, దుస్తులు అమ్మడం, నిబంధనలు ఉల్లంఘించి వేలల్లో ఫీజులు వసూలు చేయడం లాంటి పనులు యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి.

**నిబంధనలు తూచ్**

- జీవో ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో కమిటీలను ఏర్పాటు చేసి ఆ వివరాలు విధిగా నోటీసు బోర్డులపై ప్రదర్శించాలన్న నిబంధనలు ఏ పాఠశాలలో అమలవుతున్న దాఖలాలు లేవు.
- 1994లో జారీ చేసిన జీవో ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు నిర్ణయించేందుకు పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్, తల్లిదండ్రుల్లో ఇద్దరితో కమిటీని నియమించాలి. పాఠశాల వసూలు చేసే ఫీజుల్లో 5 శాతం యాజమాన్యం ఆదాయం కింద, 15 శాతం పాఠశాల నిర్వహణ, 15 శాతం అభివృద్ధికి, 15 శాతం ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రయోజనాలకు, 50 శాతం వేతనాలకు వినియోగించాలని ఉంది. ఏటా పాఠశాలలో వసూలైన ఫీజు మొత్తం, ఖర్చుల ఆడిట్ రిపోర్టులను జిల్లా విద్యాశాఖాధికారికి యాజమాన్యాలు సమర్పించాలి. కానీ, ఇవేమి జిల్లాలో అమలు కావడం లేదు.
- 2008లో జారీ చేసిన జీవో నం.90,91,92 ద్వారా ఫీజు నిర్ణయించేందుకు డీఈవో, జిల్లా ఆడిట్ అధికారి, స్వచ్ఛంద సంస్థ లేదా పేరెంట్స్ కమిటీ ప్రతినిధితో కూడిన ఫీజుల రెగ్యులేటరీ కమిటీని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నియమించాలి. సదరు కమిటీ స్కూల్‌లో వసతులను పరిశీలించి ఫీజు ఎంత వసూలు చేయాలో నిర్ణయిస్తుంది. అలాగే నిర్ధారించిన ఫీజు వివరాలు పాఠశాలల నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని నిబంధన ఉంది. కానీ, దీని అమలుపై అధికారుల పర్యవేక్షణ లేదు.

### రూ.వేలల్లో వసూలు..

ఫీజుల విషయంలో ఒక్కో స్కూల్‌లో ఒక్కో విధంగా రూ.వేలల్లో దండుకుంటున్నారు. పర్యవేక్షణ కొరవడి ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదన్న విషయం తనిఖీల్లో బయటపడింది. కరీంనగర్‌లోని పలు ప్రైవేటు స్కూళ్లలో 1వ తరగతికి రూ.18,000 నుంచి రూ.55,000, పదో తరగతికి రూ.30,000 నుంచి రూ.95,000 వసూలు చేస్తున్నారని గతేడాది అధికారుల తనిఖీల్లో తేలింది. అయితే ఫీజుల వ్యవహారంపై అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడంతో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల వ్యాపారానికి అడ్డుకట్ట లేకపోగా వారు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా తయారైంది.

**ముందస్తు ప్రవేశాలు**

జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ప్రైవేట్ స్కూళ్లు విద్యార్థుల ప్రవేశాలను ప్రారంభించగా, ఇందులో నగరంలోని చాలా పాఠశాలలు ముందంజలో ఉన్నాయి. కాగా, గత విద్యాసంవత్సరం ప్రారంభంలో అధికారుల తనిఖీల్లో మాత్రం మెజార్టీ పాఠశాలల్లో ప్రవేశాలు జరగలేదని తేల్చారు. తనిఖీ చేసిన 25 స్కూళ్లలో పదింటిలో మాత్రమే ప్రవేశాలు జరుగుతున్నాయని నివేదికలో పేర్కొనడం గమనార్హం. కానీ, క్షేత్రస్థాయిలో మెజార్టీ స్కూళ్లలో ప్రవేశాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

### నిర్లక్ష్యం వీడాలి



విద్యాశాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీకి, ముందస్తు ప్రచారాలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. దీంతో ప్రైవేట్ యాజమాన్యాలు ఇబ్బడిముబ్బడిగా విద్యార్థుల నుంచి ఫీజులు దండుకుంటున్నాయి. విద్యాశాఖ నిర్లక్ష్యం వీడకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలను ఉధృతం చేస్తాం. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసి వసతులు, ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించాలి.

– గజ్జెల శ్రీకాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి


ఉదయం కోడెకు పూజలు చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ

### ఒకే కోడెకు ప్రధాని, మంత్రి పూజలు

వేములవాడ రాజన్న కోడెమొక్కు చెల్లించుకునే క్రమంలో బుధవారం ఉదయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాత్రి రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వేములవాడకు వచ్చిన మోదీ కోడెకు పూజలు నిర్వహించగా.. తన బర్త్‌డే పురస్కరించుకొని ఆలయంలో పూజలు నిర్వహించేదుకు వెళ్లిన మంత్రి అదే కోడెకు పూజలు నిర్వహించడం విశేషం.


రాత్రి అదే కోడెకు పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

– వేములవాడ

# 'డాక్టర్లపై దాడులు తగవు'


నల్లబ్యాడ్జీలు ధరించి, ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న డాక్టర్లు

- కోరుట్ల ప్రభుత్వ వైద్యుడిపై దాడికి ఖండన
- జీజీహెచ్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన

కోల్‌సిటీ(రామగుండం): డాక్టర్లపై దాడులు చేయడం తగదని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్(టీటీజీడీఏ) ప్రతినిధులు అన్నారు. కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల ఓ ఆటో డ్రైవర్ చనిపోయిన సంఘటనపై, మృతుడి బంధువులు డాక్టర్‌పై దాడి చేయడం శోచనీయమన్నారు. దాడిని వ్యతిరేకిస్తూ గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఎదుట టీటీజీడీఏ రామగుండం కమిటీ ఆధ్వర్యంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఫరీద్ మహ్మద్, జనరల్ సెక్రటరీ రవివర్మ మాట్లాడారు. ఆస్పత్రి ఘటనపై ప్రభుత్వం విచారణ జరపకుండానే బాధిత డాక్టర్‌ను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. ఇలాంటి వాటితో డాక్టర్లలో భయం చోటుచేసుకుని వైద్య సేవలు అందించే వీలుండదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత డాక్టర్‌పై సస్పెన్షన్ తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వేణుమాధవ్, శ్రీనివాస్, ఆదిష్‌రెడ్డి, శిరీష, లక్ష్మీనర్సయ్య, రాజీవ్, మనుంజయ్, ప్రశంస, అమూల్, స్వామి, విజిత్, హర్షిణి తదితరులు పాల్గొన్నారు.